## క్లుప్తంగా

### ఉత్తమ సర్పంచ్, కార్యదర్శులకు సత్కారం



పోతునూరు సర్పంచ్ బోదుల స్వరూప్ కార్యదర్శి షరీఫ్‌ను సత్కరిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

దెందులూరు: సమష్టి కృషి, ప్రణాళిక సేవా భావంతోనే సత్ఫలితాలు లభిస్తాయని దెందులూరు ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం అన్నారు. 4 విభాగాల్లో లక్ష్య సాధనకు ఉత్తమ సర్పంచ్‌గా పోతునూరు సర్పంచ్ బోదుల స్వరూప్, ఉత్తమ కార్యదర్శులుగా షరీఫ్‌ను శుక్రవారం ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి, వైస్ ఎంపీపీ వేమూరి జితేంద్ర, గొల్ల నాగరాజు శాలువా, పూలదండలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ప్రశంసాపత్రాలు అందించారు.

### సేవా మార్గంతో ప్రశాంతత

దెందులూరు: సేవా మార్గంతోనే ప్రశాంతత, అభివృద్ధి సాధ్యపడుతుందని ఏసుక్రీస్తుకు ఇష్టమైన నీతి, నిజాయతీ, సేవా, దయ, ఆధ్యాత్మిక సేవా గుణాలతో జీవించాలని పాస్టర్ జాషువా, సునీల్, విక్టర్, రాజు అన్నారు. శుక్రవారం చల్లచింతలపూడిలో గౌడ వీధిలో క్రీస్తు సువార్త సహవాసం వారి ఆధ్వర్యంలో క్రీస్తు సువార్త ఉజ్జీవమహాసభలు పాస్టర్ సరిపల్లి సుధాకర్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. నిర్వాహకులు సుధాకర్‌బాబు పర్యవేక్షించారు.

### గ్రామాభివృద్ధిపై దృష్టి సారించాలి



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీటీసీ ఛాంబర్ సభ్యులు

నిడమర్రు: ఎంపీటీసీ సభ్యులు గ్రామాభివృద్ధిపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. నిడమర్రు మండలానికి కొత్తగా ఎన్నికైన ఎంపీటీసీ ఛాంబర్ సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యే వాసుబాబును మర్యాద పూర్వకంగా కలిశారు. వాసుబాబుకు పుష్పగుచ్ఛం అందజేశారు. వైఎస్సార్ సీపీ కన్వీనర్ సంకు సత్యకుమార్, మండల వ్యవసాయ సలహా సంఘం చైర్మన్ పోలిశెట్టి రమేష్, నీటి సంఘం అధ్యక్షుడు మండ పోలయ్య, చలంశెట్టి బాబులు, కన్నాజి రామకృష్ణ, వుగ్గాల రాధాకృష్ణ, నౌడు అచ్యుతరామారావు, ఎస్.శ్రీను, వెంకటేష్ పాల్గొన్నారు.

### బాధితులకు పరామర్శ

దెందులూరు: కొత్తగూడెం పంచాయతీ శింగవరానికి చెందిన బాధితులకు ఏలూరు వైద్యశాలలో మెరుగైన వైద్యం అందుతుందని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి జానంపేట బాబు అన్నారు. శుక్రవారం ఏలూరు వైద్యశాలలో ఫుడ్ పాయిజన్ కారణంగా రెండో రోజు వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితులను వైసీపీ నాయకులు కామిరెడ్డి నాని, పులవర్తి సంతోష్, తేజ పరామర్శించారు. మూడు రోజులుగా వైద్యసేవలు అందిస్తున్న వైద్యులకు, సిబ్బందికి జానంపేట బాబు, నాని, చల్లగోళ్ల తేజ కృతజ్ఞతలు తెలిపారు.

### విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత

పెదవేగి : ప్రభుత్వం విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తోందని, నిర్దేశించిన లక్ష్యాలను నెరవేర్చేందుకు ప్రభుత్వ ఉద్యోగులు కృషి చేయాలని పెదవేగి ఎంపీడీఓ జి రాజ్‌మనోజ్ అన్నారు. పెదవేగి మండలం పరిషత్ కార్యాలయంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లతో వివిధ సంక్షేమ పథకాలపై ఎంపీడీఓ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రాపవుట్స్‌ను గుర్తించి బడిలో చేర్పించేలా సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తినే విద్యార్థుల సంఖ్యను పెంచాలని, 29వ తేదీన అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. ఏఎస్ఓ సత్యనారాయణమూర్తి సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

### అమ్మాయిలు అన్ని రంగాల్లో రాణించాలి



సన్మానం పొందిన విద్యార్థినిలతో జాయింట్ కలెక్టరు బీ లావణ్యవేణి

పెదపాడు: ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాలని జాయింట్ కలెక్టరు బీ లావణ్యవేణి అన్నారు. పెదపాడు మండలంలోని వట్లూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గర్ల్స్ ఛాంపియన్స్ ఇన్ స్పోర్ట్స్‌గా గుర్తించిన 13 మంది బాలికలకు కలెక్టరు ఆదేశాల మేరకు సత్కారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా లావణ్యవేణి హాజరయ్యారు. సెట్‌వెల్ సీఈఓ ఎండీ మెహరాజ్, జీసీడీవో సబితా సుల్తాన్, ఏసీడీపీఓ లలిత, కోఆర్డినేటర్ పీ వాసవి, డీసీపీఓ సీహెచ్ సూర్యచక్రవేణి, పాఠశాల ప్రిన్సిపాల్ మేరీ ఝాన్సీరాణి పాల్గొన్నారు.

# నవరత్నాలతో అన్ని వర్గాల ప్రజలకూ మేలు

- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- చేబ్రోలులో గడపగడపకు మన ప్రభుత్వం



చేబ్రోలులో ఆకలవారి వీధిలో గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

ఉంగుటూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాటలు ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు స్పష్టం చేశారు. శుక్రవారం ఉంగుటూరు మండలం చేబ్రోలులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వాసుబాబు మాట్లాడుతూ పాదయాత్రలో ప్రజల బాగోగులు తెలుసుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా సంక్షేమ పథకాలు, రూపకల్పన చేశారన్నారు. ఇచ్చిన హామీలన్నీ చిత్తశుద్ధితో నెరవేర్చిన గొప్ప ముఖ్యమంత్రి జగన్ మాత్రమేనని అన్నారు. వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి ప్రజలకు పారదర్శక పాలన అందిస్తున్నారని అన్నారు. రైతులకు ఆర్‌బీకే వ్యవస్థను తీసుకువచ్చి అన్నదాతలందరికీ మేలు చేయడంతోపాటు వారి గౌరవాన్ని ముఖ్యమంత్రి పెంచారన్నారు. విద్యారంగంలో ఇంగ్లీషు మీడియం బోధనను తీసుకువచ్చి మార్పు తెచ్చారన్నారు. నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. అమ్మఒడి తీసుకువచ్చి పేద విద్యార్థులు ఆర్థికంగా ఇబ్బంది పడకుండా జగన్ చేశారన్నారు. వైద్యరంగంలో అనేక మార్పులు చేపట్టి పలు మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. వలంటీర్ వ్యవస్థ, సచివాలయ వ్యవస్థలు తీసుకువచ్చి ప్రజలకు పాలన దగ్గర చేసిన వైనాన్ని అందరూ గ్రహించాలని వాసుబాబు కోరారు. సీఎం జగన్‌కు ప్రజలు అండగా నిలవాలని వాసుబాబు కోరారు. సెంటర్లో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించి గడపగడపకు కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైసీపీ నాయకులు గజమాలతో వాసుబాబుకు స్వాగతం పలికారు. మహిళలు హారతులిచ్చారు. జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, ఎంపీపీ గంట శ్రీలక్ష్మి, వైసీపీ మండల కన్వీనర్ మరడ మంగరావు, సొసైటీ అధ్యక్షుడు పాపారావు బాబ్జి, పంచాయతీరాజ్ అధ్యక్షుడు పుప్పాల గోపి, ఏఎంసీ మాజీ చైర్మన్ మరడ రమావతి, యువజన విభాగం మండల కన్వీనర్ ఆకుల రాజు, నాయకుడు, మాజీ సర్పంచి కరణం బుజ్జి, ఎంపీటీసీ సభ్యులు రాయిలక్ష్మి, మనసాల నాగమణి, కోటేశ్వరరావు, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ షాజహన్, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ముత్యాబుజ్జి, సచివాలయ కన్వీనర్ దువ్వాకుల రామరాజు, ఎంపీడీవో ఆంజనేయులు, పీఆర్ ఏఈ సతీస్, హౌసింగ్ ఏఈ సురేష్, నాయకులు పాల్గొన్నారు.

## 1 నుంచి వేంకటేశ్వరుని కల్యాణోత్సవాలు

భీమడోలు: గుండుగొలనులో వేంచేసియున్న వేంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణోత్సవాలు మే 1 నుంచి 6వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో డి.శంకరరావు తెలిపారు. భీమడోలులో శుక్రవారం పేర్కొన్నారు. మే 1వ తేదీన స్వామి వారిని పెళ్లి కుమారుడిగా అలంకరిస్తామన్నారు. 2న నవకుంభారాధన, కల్యాణం, 3న ఎదురు సన్నాహ కార్యక్రమం, 4న స్వామి వార్ల ఊరేగింపు, గరుడోత్సవం, 5న చక్రస్నానం, పుర్ణాహుతి, రాత్రి తెప్పోత్సవం, 6న పుష్పోత్సవం, ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, 7న అన్న సమారాధన నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు.

## పరిశుభ్రతతోనే ఆరోగ్యం

గణపవరం: పరిశుభ్రతతోనే ఆరోగ్యం చేకూరుతుందని, ప్రస్తుతం వైరల్ జ్వరాలు ఎక్కువగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా అంటు వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు పులపర్తి సంతోష్, కిరణ్మయి అన్నారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడే సందర్భంగా వైద్య సిబ్బంది శుక్రవారం ప్రజలకు పరిశుభ్రత, అంటువ్యాధులపై అవగాహన కల్పించారు.

## డ్రాపవుట్స్‌ను విధిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో జీఎల్ఎన్‌వీ రాఘవన్, చిత్రంలో ఎంఈవో డి.సాంబశివరావు

భీమడోలు: పాఠశాల బడిఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులపై ఉందని భీమడోలు ఎంపీడీవో జీఎల్ఎన్‌వీ రాఘవన్ అన్నారు. భీమడోలు ఎంఆర్సీలో శుక్రవారం ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు విద్యాశాఖ కార్యక్రమాలపై సోషల్ ఆడిట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈవో డి.సాంబశివరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 15 పిల్లలను డ్రాపవుట్స్‌గా ఉన్నాయని, వారందరినీ హెచ్‌ఎంలు గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. డ్రాపవుట్స్ ఉన్న పాఠశాలల హెచ్‌ఎంలు మే 1న ఏలూరులో నిర్వహించనున్న సమావేశానికి విధిగా హాజరు కావాలన్నారు. మండలంలోని ఉన్నత పాఠశాలల్లో నైట్ వాచ్‌మెన్‌లను ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి నియమించుకోవాలన్నారు. ఈనెల 29న ప్రతి ప్రభుత్వ పాఠశాలలో పేరెంట్స్ కమిటీ సమావేశాలు నిర్వహించి విద్యార్థుల ప్రగతికి సంబంధించిన పత్రాలను అందించాలన్నారు. పేరెంట్స్ కమిటీ సమావేశాల నిర్వహణ అమలుపై ప్రత్యేక రిజిస్టర్ ఏర్పాటు చేయాలన్నారు. నాడు–నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఎండీఎం 80శాతం కన్నా తక్కువగా నమోదైన పాఠశాల హెచ్‌ఎంలకు సంజాయిషీ పత్రాలు అందిస్తామన్నారు. ప్రభుత్వ పథకాల లక్ష్యాలను నెరవేర్చాలని సూచించారు. ఎంఈవో డి.సాంబశివరావు మాట్లాడుతూ మేనెల 8 నుంచి జూన్ 16వ తేదీ వరకు జిల్లా గ్రంథాలయ సంస్థ శాఖా గ్రంథాలయాల్లో నిర్వహించనున్న వేసవి విజ్ఞాన శిబిరానికి 5 నుంచి 9వ తరగతి విద్యార్థులను విధిగా పంపించాలన్నారు. అనంతరం సోషల్ ఆడిట్‌పై ఎస్ఆర్‌పీ కె.హరికృష్ణ హెచ్‌ఎంలకు శిక్షణ అందించారు. హెచ్‌ఎంలు, సీఆర్‌పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

## పేదలందరికీ ఇళ్లు పథకం.. పేదలపాలిట వరం



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో జీఎల్ఎన్‌వీ రాఘవన్, సర్పంచ్ భలే రాంబాబు

భీమడోలు: నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకం పేదలపాలిట వరమని భీమడోలు ఎంపీడీవో జీఎల్ఎన్‌వీ రాఘవన్ అన్నారు. ఆగడాలలంకలో జగనన్న హౌసింగ్ లే అవుట్‌లో ఇంకా ఇళ్లు నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులతో శుక్రవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సర్పంచ్ భలే రాంబాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో జీఎల్ఎన్‌వీ రాఘవన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇళ్ల స్థలాలను కేటాయించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీల్లో లబ్ధిదారులంతా ఇళ్లు నిర్మించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కొల్లేరు గ్రామం ఆగడాలలంకలో 196 మందికి ఇళ్ల పట్టాలను అందించగా వాటిలో ఇంకా 76 మంది నిర్మాణాలు చేపట్టలేదన్నారు. వారంతా వచ్చే నెల 12వ తేదీ లోగా నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులు వేగంగా పనులు చేసి సకాలంలో పూర్తి చేయాల్సి ఉందన్నారు. ప్రభుత్వం రూ.1.80 లక్షలతో పాటు డ్వాక్రా మహిళలకు పావలా వడ్డీకి రూ.35వేల రుణం అందిస్తుందన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ సీహెచ్ సతీష్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను అభినందిస్తే దాడులు చేస్తారా?

- తీరు మార్చుకోని చింతమనేని అనుచరులు
- వైఎస్సార్‌సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న దెందులూరు మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని

దెందులూరు: ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను అభినందించినవారిపై చింతమనేని వర్గీయులు, టీడీపీ నేతలు దాడులు చేసి చంపుతానని బెదిరించడం ఆ పార్టీ దిగజారుడుతనానికి నిదర్శనమని వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. శుక్రవారం గోపన్నపాలెంలో దాడికి గురైన పసుమర్తి శ్రీనును ఆయన పరామర్శించారు. శ్రీను షాపులో పగులకొట్టిన కూల్‌డ్రింక్ సీసాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో కామిరెడ్డినాని మాట్లాడుతూ గత నెలలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి గోపన్నపాలెంలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పసుమర్తి సత్యనారాయణ ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా సత్యనారాయణ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరితో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు బాగున్నాయని, పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఎంతో మేలు చేసే విధంగా ఉన్నాయని అభినందించారు. ఆ సంఘటనను దృష్టిలో పెట్టుకుని అతని కుమారుడు పసుమర్తి శ్రీను కూల్‌డ్రింక్ షాపులో గురువారం అర్ధరాత్రి గోపన్నపాలెంకు చెందిన విద్యుత్ శాఖ ఉద్యోగి బొర్రా చందు, గాలాయగూడెం సబ్‌స్టేషన్‌లో విద్యుత్ ఉద్యోగి ముళ్ళపూడి సుధాకర్ ఇద్దరూ మద్యం సేవించి శ్రీను షాపు పక్కన ఉన్న నూడిల్స్ షాపు వద్దకు వెళ్లి దుర్భాషలాడి అధికారంలో ఉన్న పార్టీకి శ్రీను వత్తాసు పలుకుతాడా... చంపేస్తాం అంటూ బెదిరించి కూల్‌డ్రింక్స్‌ను పగలగొట్టారు. గోపన్నపాలెం ప్రశాంతతకు మారుపేరుగా ఉందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక చింతమనేని, అతని వర్గీయులు గోపన్నపాలెం మాజీ సర్పంచ్ మాగంటి నారాయణప్రసాద్ అతని అనుచరులు దాడులకు దిగి బెదిరించడం సిగ్గు చేటన్నారు. నిందితులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గోపన్నపాలెం సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్ మాట్లాడుతూ మాజీ సర్పంచ్ మాగంటి నారాయణప్రసాద్, అనుచరుల ప్రోద్బలంతో ఈ దాడులు జరిగాయన్నారు. ప్రశాంతంగా ఉన్న గోపన్నపాలెంలో టీడీపీ నాయకులు ఈ తరహా దాడులు చేయడం బాధాకరమన్నారు. సమావేశంలో వ్యవసాయ సలహామండలి దెందులూరు చైర్మన్ కొండేటి గంగాధరబాబు, పార్టీ గ్రామ అధ్యక్షుడు వీరంకి సత్యనారాయణ, ఎంపీటీసీలు ఏనుగు అంజలి ప్రసాద్, సువ్వా ప్రభుదాసు, ఉపసర్పంచ్ తోట పద్మారావు, పార్టీ నాయకులు మోర్ల సుబ్బారావు, హేమసాగర్, పీ.రాజు, దొండా శ్రీను, గ్రామస్తులున్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఈ సంఘటనపై ఫిర్యాదు నమోదైందని దెందులూరు ఎస్సై ఐ.వీర్రాజు వివరించారు.

## దోమల నివారణ సామాజిక బాధ్యత



వీరభద్రపురంలో ఫ్రైడే, డ్రై డే కార్యక్రమం నిర్వహిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఆశ

దెందులూరు: సామాజిక బాధ్యతతోనే దోమల నివారణ సాధ్యపడుతుందని అది జరిగితేనే డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వంటి ప్రాణాంతక వ్యాధులు మన బారిన చేరవమని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఆశ అన్నారు. శుక్రవారం మండలంలోని గోపన్నపాలెం ఆరోగ్య కేంద్రం పరిధిలోని వీరభద్రపురంలో ఫ్రైడే, డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. జ్వరాలపై అశ్రద్ధ చేయవద్దని, జ్వరంతో బాధపడిన వ్యక్తి స్థానికంగా వైఎస్సార్ హెల్త్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్‌ను సందర్శించాలన్నారు. జిల్లా మలేరియా అధికారి పీఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ కీటకాల్లో అత్యంత ప్రమాదకరమైన కీటకం దోమన్నారు. తొలుత ర్యాలీ నిర్వహించి ఫ్రై డే, డ్రై డే పాటించాలని ప్రధాన వీధుల మీదుగా ర్యాలీ చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పీ.రోజా లలిత, అసిస్టెంట్ మలేరియా అధికారి జే. గోవిందరావు, ఎంపీహెచ్ఈఓ నాగరాజు. వైద్య సిబ్బంది, సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి, ఎంపీటీసీలు ఏనుగు అంజలి ప్రసాద్, సువ్వా ప్రభుదాసు ఉన్నారు.

## ఉత్సాహంగా 'మా నమ్మకం నువ్వే జగన్' సర్వే



ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్న సర్పంచ్ షేక్ రహీమాబేగం హసేనా, ఎంపీటీసీ అంబటి దేవి

భీమడోలు: జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో వైసీపీ శ్రేణులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల ప్రజాపాలనపై ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. పోలసానిపల్లిలోని సర్పంచ్ షేక్ రహీమాబేగం హసేనా, ఎంపీటీసీ అంబటి దేవీ ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో కలిసి గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి వారికి అందుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో తమంతా వైఎస్ జగన్‌కు ఓట్లు వేసి గెలిపిస్తామని, ఇంటి వద్దకే పింఛన్, ఇతర సంక్షేమ పథకాలను అందిస్తున్న ఆయనను గెలిపించి, రుణం తీర్చుకుంటామని పథకాల లబ్ధిదారులు పేర్కొన్నారు. దీనితో పార్టీ శ్రేణులు ఉప్పొంగిన ఉత్సాహంతో ముందుకు సాగారు. 80శాతానికి పైగా లక్ష్యాన్ని చేరుకున్నామని, ప్రజల నుంచి స్పందన అమోఘమని నియోజకర్గ మైనార్టీ సెల్ కన్వీనర్ షేక్ హసేనా తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, గృహ సారథులు పాల్గొన్నారు.

## తెల్లదోమతో ఉద్యాన పంటలకు నష్టం



విజయరాయిలోని మొక్కజొన్న పరిశోధన కేంద్రం వద్ద రైతుభరోసా సిబ్బందికి సూచనలు ఇస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్త తిరుపతిరెడ్డి

పెదవేగి : పామాయల్, కొబ్బరి తోటల రైతులకు సర్పిలాకార తెల్లదోమ ఎక్కువ నష్టం కలిగిస్తుందని వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త ఎం. తిరుపతిరెడ్డి తెలిపారు. పెదవేగి మండలం విజయరాయిలోని మొక్కజొన్న పరిశోధన కేంద్రం వద్ద దెందులూరు నియోజకవర్గంలోని రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి సర్పిలాకార తెల్లదోమ నివారణ చర్యలపై శుక్రవారం శిక్షణను ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెల్లదోమ మొక్కల ఆకుల కింద భాగాలను ఆశించి రసాన్ని పీల్చడంతో ఆ రసం మొక్కలపై పడి సూర్యకిరణాల వల్ల ఆకులపై మసి పొరలుగా ఏర్పడి ఎదుగుదల క్షీణిస్తుందన్నారు. తెల్లదోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పిచికారీ చేయాల్సిన మందులపై అవగాహన కల్పించారు. రైతులందరూ ఈ నివారణ చర్యలు సామూహికంగా చేపడితే సత్ఫలితాలు వస్తాయన్నారు. గ్రామాల్లోని రైతులకు అవగాహన కల్పించాలని ఆయన ఆర్‌బీకే సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి పి.రవికుమార్, పెదవేగి మండల ఉద్యానాధికారి ఎం.రత్నమాల, పెదపాడు, పెదవేగి, దెందులూరు, ఏలూరు, ముసునూరు మండలాలకు చెందిన రైతు భరోసా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటర్‌లో సబ్జెక్టు టాపర్లకు అభినందన

ఉంగుటూరు: నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసిన వారిలో సబ్జెక్టు టాపర్లను శుక్రవారం ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అభినందించారు. ద్వితీయ ఇంటర్ ఎంపీసీలో కె. హేమలతకు ఇంగ్లీషులో 94, ఎస్. బాలశివమణికి తెలుగులో 99, ఎస్ రాజరాజేశ్వరి తెలుగులో 96, ఎస్ మోనిక తెలుగులో 90 మార్కులు సాధించారు. ద్వితీయ ఇంటర్ బైపీసీలో దేవిశ్రీలక్ష్మి తెలుగులో 99, పి భవిత ఇంగ్లీషులో 95, టి. గీత భవాని బోటనీలో 55 మార్కులు సాధించారు. ద్వితీయ ఇంటర్‌లో సీఈసీలో పి. ఉదరాణి ఇంగ్లీషులో 90, ఎస్. అమృత మహిణి 90, ఎం. యస్వంత్ తెలుగులో 96, నవీన్‌కుమార్ తెలుగులో 92, బి రామ్య కామర్స్‌లో 99, జి. భవానికి ఎకనామిక్స్‌లో 92, ఎం.సింధు కామర్స్‌లో 90 మార్కులు సాధించారు. ద్వితీయ ఇంటర్‌లో హెచ్ఈసీలో ధనలక్ష్మి హిస్టరీలో 86 మార్కులు, సాధించారు.

## ధాన్యం రవాణాకు సమస్యలు పరిష్కరించాలి

భీమడోలు: ధాన్యం రవాణాకు లారీలు పంపాలని, గోనె సంచులను ఇవ్వాలంటూ శుక్రవారం భీమడోలు సొసైటీ వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు, కౌలు రైతులు ఆందోళన చేసారు. అధికారులు అలసత్వం వల్ల రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నామంటూ వారంతా ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా జిల్లా రైతు కార్యదర్శి కె.శ్రీనివాస్, సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు మాట్లాడుతూ అధికారులు నిర్లక్ష్యం వహించడం వల్ల అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. భీమడోలు 1,600 ఎకరాల్లో 1,550 ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయని, 16,467 మెట్రిక్ టన్నుల లక్ష్యం కాగా ఇప్పటి వరకు 2,752 టన్నులు మాత్రమే ధాన్యం కొనుగోలు చేసారన్నారు. 2.18లక్షల గోనె సంచులకు, 60వేల గోనె సంచుల ధాన్యాన్ని మాత్రమే మిల్లులకు తరలించామన్నారు. మిగిలిన 1.58 లక్షల గోనెల్లోని ధాన్యాన్ని కళ్లాల్లో ఉందన్నారు. తహసీల్దార్ షంషూద్దీన్‌కు రైతు సంఘం నాయకులు ఫోన్‌లో సమస్యను తెలియజేయగా ధాన్యం కొనుగోలు సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రైతులు కఠారి మురళీకృష్ణ, కె.వెంకట్రావు, కె.కనకరాజు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలులో రైతులకు అండగా ఉంటాం



గణపవరం మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అర్ధవరం రాము

గణపవరం: రబీ ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా చూస్తామని, దీనిపై అధికారులు మిల్లర్లతో చర్చిస్తారని గణపవరం మండలాధ్యక్షుడు అర్ధవరం రాము అన్నారు. శుక్రవారం సాయంత్రం గణపవరం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో కోమర్రు ఎంపీటీసీ ఉమా సీతామహాలక్ష్మి మాట్లాడుతూ రబీ ధాన్యం కొనుగోలులో గణపవరం మిల్లర్లు తేమ, నూక శాతం పేరుతో బస్తాకు రూ.100 వరకూ కోత విధిస్తున్నారని, పక్క మండలాల్లో అదే ధాన్యం రూ.20 నుంచి రూ.25 మాత్రమే తగ్గిస్తున్నారని సభ దృష్టికి తెచ్చారు. దీనిపై ఎంపీపీ మాట్లాడుతూ తాను, తహసీల్దార్, ఎంపీడీవో, వ్యవసాయాధికారి మిల్లర్లతో చర్చించి, రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఎంపీడీవో జ్యోతిర్మయి మాట్లాడుతూ మండలంలోని అన్ని జగనన్న కాలనీల్లో విద్యుత్, రోడ్లు, మంచినీటి సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు. ఇంకా ఇళ్ల నిర్మాణం ప్రారంభించని వారి విషయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు చెరొక ఐదు ఇళ్ల నిర్మాణ బాధ్యతలు తీసుకోవాలని కలెక్టరు ఆదేశించారని, ఈ దిశగా వారు సహకరించాలని కోరారు. తహసీల్దార్ పమ్మి లక్ష్మి మాట్లాడుతూ మండలంలో అవసరమైన మేరకు గోనె సంచులు అందుబాటులో ఉన్నాయని, రెండు రోజులుగా ధాన్యం ఎగుమతులు జోరందుకున్నాయన్నారు. మండలంలో జగనన్న భూసర్వే కార్యక్రమంలో మొత్తం డ్రోన్ సర్వే పూర్తయిందని, రీసర్వే వేగవంతం చేశామని చెప్పారు. ఆరోగ్యశాఖ అధికారి విల్సన్ మాట్లాడుతూ వైద్యసేవలు, ఆస్పత్రి ప్రసవాలు, కుక్క,పాముకాటు చికిత్సలలో గణపవరం పిహెచ్‌సి జిల్లాలోనే రెండో స్థానంలో నిలిచిందన్నారు. ఐకేపీ అధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకూ ఆసరా పథకంలో రూ.9 కోట్లు, వైఎస్సార్ సున్నా వడ్డీ పథకంలో రూ.6 కోట్లు మహిళా సంఘాలకు జమ చేసినట్లు చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి హరనాథ్‌రాజు మాట్లాడుతూ మండలంలో జలజీవన్ మిషన్ పథకంలో రూ.12 కోట్లు మంజూరు కాగా 15పనులు ప్రగతిలో ఉన్నాయన్నారు. విద్యుత్‌శాఖ ఏఈ ప్రసాద్ మాట్లాడుతూ మండలంలోని 28 జగనన్న కాలనీల్లో ఇప్పటివరకు 18 చోట్ల విద్యుదీకరణ పనులు పూర్తి చేశామన్నారు. ఎంఈవో పుచ్చల శేషు మాట్లాడుతూ మండలంలో నాడు–నేడు రెండో దశ పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. వచ్చే విద్యాసంవత్సరంలో అయా గ్రామాల నుంచి ఎక్కువమంది పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సహకరించాలని కోరారు. మత్స్యశాఖ అధికారి శివరామకృష్ణ మాట్లాడుతూ మండలంలో ఆక్వా జోన్‌లో 1291 విద్యుత్ కనెక్షన్లు ఉండగా అర్హతకలిగిన 1092 కనెక్షన్లకు సబ్సిడీపై విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. 10 ఎకరాలున్న రైతులకు కూడా విద్యుత్ సబ్సిడీ ఇవ్వడానికి ప్రభుత్వం అంగీకరించిందని, త్వరలోనే ఉత్తర్వులు వస్తాయని చెప్పారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాట్లాడుతూ మిషన్ వాత్సల్య పథకంలో 96 దరఖాస్తులు ఎంపిక చేశామని, మరో 76 దరఖాస్తులు పరిశీలించాల్సి ఉందన్నారు. ఎ.గోపవరం సర్పంచ్ పాఠంశెట్టి పద్మావతి శ్రీను మాట్లాడుతూ ఐసీడీఎస్ శాఖ నిర్వహించే కార్యక్రమాల సమాచారం సర్పంచ్‌కు తెలియజేయడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ అర్ధవరం రాము మాట్లాడుతూ మండలంలో ఏ గ్రామంలోనూ వేసవిలో నీటి సమస్య రాకుండా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సర్పంచ్‌లను కోరారు. మరో రెండు రోజులు కాల్వకు నీరు వస్తుందని, చెరువులను నింపుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో వివిధశాఖల అధికార్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

## నేడు ఉంగుటూరు మండల పరిషత్ సమావేశం

ఉంగుటూరు: ఉంగుటూరు మండల పరిషత్ సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ గంట శ్రీలక్ష్మి తెలిపారు. ఈ సమావేశంలో శాఖలవారి అభివృద్ధి సమీక్షిస్తామని తెలిపారు. ఈసమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొనాలని, అధికార్లు సకాలంలో హాజరుకావాలని ఎంపీపీ కోరారు.